GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

MEDIA

మెయిన్

సంపుటి : 6 సంచిక : 216 ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ శుక్రవారం 22-03-2024 పేజీలు : 3

## సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పిన పతంజలి ఆయుర్వేద




**టీ మీడియా, మార్చి 21, న్యూఢిల్లీ:**
పతంజలి ఆయుర్వేద ఎండీ ఆచార్య బాలకృష్ణ గురువారం సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారు. తమ కంపెనీకి చెందిన ఉత్పత్తులపై వచ్చిన వాణిజ్య ప్రకటనల కేసులో ఆయన సారీ తెలిపారు. తప్పుడు యాడ్స్ ఇస్తున్నారని పతంజలి సంస్థకు రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ కంపెనీ సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసింది. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అషానుద్దిన్ అమనుల్లా ఆ కేసును వాదించారు. ఏప్రిల్ 2వ తేదీన కోర్టు ముందు హాజరుకావాలని బాలకృష్ణకు ఆదేశాలు జారీ చేశారు. అయితే కోర్టు ఆదేశాల పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందని, తమ ఉల్లంఘనల పట్ల క్షమాపణలు చెబుతున్నట్లు అఫిడవిట్‌లో బాలకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి యాడ్స్ రాకుండా తమ కంపెనీ జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

## ఉద్యమ పార్టీ లో పెరిగిన ఉలికి పాట్లు



- ఓవర్ లోడ్ చేసు కోవడం కారణం
- సైలెంట్ గా కారు దిగుతున్నారు
- లోకసభ ఎన్నికల్లో కనిపించని దూకుడు
- 11మంది అభ్యర్థులు ను ప్రకటించి నా నో జోష్

**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్:**
ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు ఏమైంది..? లోక్‌సభ ఎన్నికల వేళ నేతల్లో జోష్ ఎందుకు తగ్గింది..? ఇప్పుడే హాట్ టాపిక్ అయ్యింది. లోక్‌సభ ఎన్నికల వేళ నేతల్లో జోష్ ఎందుకు తగ్గింది. ఇప్పుడే హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పటివరకు 11 మంది లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించారు అధినేత కేసీఆర్. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా ప్రచారంలో దూకుడు కనిపించడం లేదు. అయా నియోజకవర్గాల్లో పరిస్థితులపై ముఖ్యనేతల సమీక్షలు చేస్తున్నా, కొంత స్తబ్దత అయితే కనిపిస్తోంది. దీన్ని అధిగమించేందుకు అధినేత కేసీఆర్ ఎలాంటి దిశానిర్దేశం చేస్తారు అనేదే కీలకం. డబుల్ డిజిట్ సీట్లు టార్గెట్‌గా పెట్టుకున్నందున.. లోక్‌సభ స్థానాల వారీగా ఎక్కడ ఎలాంటి వ్యూహం అమలు చేస్తారు.. క్యాడర్ చేజారిపోకుండా ఎలాంటి భరోసా ఇస్తారు అనేదీ చర్చనీయాంశమైంది. 14 ఏళ్ల ఉద్యమం, పదేళ్ల అధికారం%ా% ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు, పోలీసులు ఎంత నిర్బంధం చేసిన ఎదుర్కొని పార్టీని ముందుకు నడిపించిన కేసీఆర్‌కు ప్రస్తుతం ఎప్పుడూ లేని కష్టాలు ఎదురవుతున్నాయి. 2014లో అధికారంలోకి రాగానే కారు డోర్లు బార్లా తెరిచారు కేసీఆర్. కెపాసిటీకి మించి వరదలా వలసలు వచ్చి పార్టీలో చేరిపోయాయి. ఇక 2018 ఎన్నికల తర్వాత రికార్డు మెజారిటీ సాధించిన మళ్లీ చేరికలను ప్రోత్సహించారు. కొన్ని నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలతో పాటు ఓడిన ప్రత్యర్థి, మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థి కూడా గులాబీ కండువాలు కప్పుకున్నారు. దీంతో తెలంగాణలో తిరుగులేని పార్టీ అంటూ ప్రచారం చేసుకుంది బీఆర్ఎస్. 2019 పార్లమెంటు సీట్లలో కూడా 11 స్థానాలను గెలుపొందింది. మరోవైపు జాతీయ పార్టీగా మారెందుకు వ్యూహాలను రచించుకుంది. ఏకంగా పార్టీ పేరును కూడా మార్చుకున్నారు కేసీఆర్. కానీ ఇప్పుడు సీన్ రివర్స్. మొన్నటివరకు ఓవర్ క్రౌడ్ తో ఉన్న కారు ఖాళీ అవుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక్కొక్కరుగా కారు దిగి సైలెంట్‌గా వెళ్ళిపోతున్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు ఐదుగురు సెట్టింగ్ ఎంపీలు పార్టీని వేయడం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, నాగర్ కర్నూల్ ఎంపీ రాములు, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్, బీజేపీ పార్టీలోకి మారిపోయారు. ఇక ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌తో సహా, నలుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ లోకి వెళ్లిపోయారు. ఇప్పటికే వరుసగా ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇంకా పార్టీని వీడే నేతల సంఖ్య పెరుగుతుందని అంచనాలు ఉన్నాయట. ఒకవైపు పార్టీ బలహీనపడుతుంటే మరోవైపు కేసుల పేరుతో మరో తలనొప్పి మొదలైంది కేసీఆర్‌కు. ఢిల్లీ లిక్కర్ కేసులో పార్టీ నేత, కూతురు కవితను అరెస్ట్ చేయడం మరో దెబ్బ. ఇంకోవైపు రాష్ట్రంలో మాజీ మంత్రి మల్లారెడ్డితో సహా ఎమ్మెల్యేలు, పలువురు బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం రకరకాలుగా దాడి చేస్తోంది. ఇది కూడా ఇబ్బందిగా మారిందట. 24 ఏళ్ల భారత రాష్ట్ర సమితికి అన్ని వైపులా ఎదురు దెబ్బలే కనిపిస్తున్నాయట. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు గెలుస్తామని.. అందుకు తగ్గట్లుగా వ్యూహాలు రచిస్తూ దూసుకెళ్తోంది. అయితే బీఆర్ఎస్ పార్టీలో మాత్రం ఆ జోష్ కనిపించట్లేదు. గతంలో టికెట్ల కోసం పార్టీలో పోటాపోటీ ఉండేది. కానీ ఇప్పుడు టికెట్ ఇస్తామన్నా పోటీ చేసేందుకు నేతలు సిద్ధంగా లేరు. ఇప్పటివరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కేంద్రం ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల చేసింది. కానీ ఫీల్డ్‌లో మాత్రం పరిస్థితులు అనకూలంగా లేకపోవడంతో అభ్యర్థులు కూడా అంతగా ప్రచారంలో కనిపించట్లేదట.

## కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు మోడీ యత్నం

### కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ

**టీ మీడియా, మార్చి 21, న్యూఢిల్లీ :**
ఎన్నికల ముందు తమ పార్టీని ఆర్థికంగా కుంగదీసేందుకు మోడీ ప్రభుత్వం క్రమబద్ధంగా యత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆర్థిక పరిస్థితిపై దాడి ఆమోదయోగ్యం కాదని, అప్రజాస్వామికమని మండిపడ్డారు. " ఈరోజు మనం ఎదుర్కొంటున్న సమస్య చాలా తీవ్రమైనది. ఈ చర్యలు కేవలం కాంగ్రెస్ పార్టీపైనే కాదు, ప్రజాస్వామ్యంపైనే ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా కుంగదీయడానికి ప్రధాని మోడీ క్రమబద్ధమైన చర్యలు చేపడుతున్నారు. ప్రజల నుండి తమ పార్టీ సేకరించిన నిధులను స్తంభింప చేస్తున్నారు. మా ఖాతాల నుండి నగదును



బలవంతంగా దోచుకుంటున్నారు" అని అన్నారు. అయినప్పటికీ.. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో కూడా, తమ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని సమర్థవంతంగా కొనసాగించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్న సుప్రీంకోర్టు తీర్పుని సమర్థిస్తూ.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిజెపి భారీగా లాభపడిందని వెల్లడైందని అన్నారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఎన్నికలకు రెండు నెలల ముందు ప్రణాళికా బద్ధంగా పార్టీ ఆర్థిక ఖాతాలను స్తంభింపచేశారని అన్నారు. ఒక నోటీసు 90ల్లో వచ్చిందని, మరో నోటీసు ఆరు-ఏడేళ్లకు ముందు వచ్చిందని మొత్తం నగదు రూ.14 లక్షలని అన్నారు. శిక్ష పార్టీ ఆర్థిక ఖాతాలపై పడిందని అన్నారు. ఎన్నికల్లో పోరాడే సామర్థ్యం దెబ్బతిందని, నెలరోజులు వృధాగా పోయాయని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నేత అజయ్ మాకెన్‌లు పాల్గొన్నారు.

## గేట్లు తెరిస్తే.. వరదే

- త్వరలో రెవెన్యూ వైట్ పేపర్
- ధరణి ఆ సర్కారు సీక్రెట్ సంస్థ
- జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా
- మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి



**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్:**
మేం ఇంకా గేట్లు తెరవలేదు, తెరిస్తే వరద వస్తుంది అని మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలో విలేఖరులతో మాట్లాడుతూ, త్వరలో రెవెన్యూ శాఖపై వైట్ పేపర్ విడుదల చేస్తాం, కమిటీ సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటాం, సీఎం అయ్యే స్థాయి నాకు లేదు, అది బేస్ లెస్ వాదన, ఆశలకు కూడా ఒక హద్దు ఉంటుందని అన్నారు. ప్రస్తుతం తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని, మిషన్ భగీరథ అద్భుతమైనదని, ఇంకా మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతామని పొంగులేటి అన్నారు. అందుబాటులో ఉన్న జలవనరులు పరిగణనలోకి తీసుకుని , తెలంగాణను మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దుతాం అన్నారు. ఇక గృహ నిర్మాణానికిప్రతియేటా 18 వేల నుంచి 20 వేల కోట్లు అంచనా వేశామన్నారు. ఇక ధరణి పోర్టల్ గురించి మాట్లాడుతూ, అది ఆ ప్రభుత్వానికి ధరణి సీక్రెట్ సంస్థ, ఈ వ్యవస్థకు మేం దూరం అన్నారు. ఇక ముఖ్యమంత్రి వెంట ఉంటే రెండో స్థానం ఎలా అంటారు, మేం ఫోన్ ట్యాపింగ్ చెయ్యం.. ఆ అవకాశం మాకు అక్కర్లేదని పొంగులేటి వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా తెలంగాణలో 14 స్థానాలు గెలుస్తుందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో బిఆర్ఎస్‌కు ఒకటో, రెండో వస్తే గొప్ప అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడేందుకు వెనకాడబోమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 10కి పైగా ఎంపీ సీట్లు గెలవబోతున్నామన్నారు పొంగులేటి. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని తమకు ఎంఐఎం మద్దతు తెలపుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ కు ఒకటి రెండు ఎంపీ సీట్లు గెలిస్తే ఎక్కువన్నారు. బీఆర్ఎస్ నేతలపై కక్ష పూరితంగా కేసులు పెడుతున్నామంటున్నారనే దానిపై వివరణ ఇస్తూ,. అవన్నీ గత ప్రభుత్వంలో వాళ్లు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులన్నారు. జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటి ఫోటోలు.. వీడియోలు పెట్టి కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు పొంగులేటి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్ లో.. రాబోయే వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత గత ప్రభుత్వంపై ఉందని,..కానీ వాళ్లు చేయాల్సిన పనులు చేయకుండా భాద్యత విస్మరించారని తెలిపారు. కాళేశ్వరం ఫలితం ఎవరికి దక్కిందో అందరికి తెలిసిందేన్నారు.

## మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

### పిసిసి తెలంగాణ చీఫ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్ :**
తాను సీఎం కుర్చీలో కూర్చోవడానికి మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలే కారణమన్నారు పిసిసి తెలంగాణ చీఫ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నాడు కొందరు నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు భుజాలపై జెండా మోసి తనను ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. మల్కాజిగిరి నేతలతో రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2,964 బూత్‌లలో ప్రతీ బూత్‌లో ఒక సైనికుడిలా కార్యకర్తలు పనిచేశారని అన్నారు. దేశంలోనే అతిపెద్ద లోక్ సభ స్థానం మల్కాజిగిరి అని.. మల్కాజిగిరి గెలుపు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందని తెలిపారు. కేసీఆర్ పతనం 2019 మల్కాజిగిరి పార్లమెంట్ నుంచే మొదలైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా మల్కాజిగిరిలో పరిధిలో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదని గుర్తుచేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం నాలుగు స్థానాలు గెలిస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది అన్నారు. అందుకే మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి.. అప్పుడే మన ప్రాంతం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు రేవంత్ రెడ్డి. లోక్ సభతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవాలని సూచించారు. హెూలీ పండగలోగా అధిష్టానం అభ్యర్థులను ప్రకటిస్తుందని.. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. బలమైన నాయకత్వం ఉంది.. సమన్వయంతో ముందుకెళ్ళాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులు ఒక ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకోవాలన్నారు.. మల్కాజిగిరి లో గెలుపు అభ్యర్థిది కాదు.. తనది అని అన్నారు.

### రాష్ట్రంలో పకడ్బందీగా

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

### సీఎస్ శాంతి కుమారి



**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్ :**
లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలీస్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఏవిధంగానైతే పని చేశారో అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే వివిధ శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీటిలో పోలీస్ శాఖ ద్వారా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులున్నాయని తెలిపారు. ఇప్పటివరకు పోలీసుల తనిఖీల్లో రా రూ. 10 కోట్లు పట్టుబడ్డాయన్నారు. లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాదీన పర్చుకున్నామని తెలిపారు. రవాణా శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని తెలిపారు. రవాణా శాఖ బృందాలు జరిపిన తనిఖీల్లో రూ. 34 .31 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 16 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం తోపాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వీటితోపాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను పంచేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. వీటితోపాటు 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా ఉంచామని పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ క్రిమినల్ చర్యకు పాల్పడ్డారు

### కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



**టీ మీడియా, మార్చి 21, న్యూఢిల్లీ:**
తమ బ్యాంక్ అకౌంట్లను అన్నింటినీ ఫ్రీజ్ చేశారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల కోసం తమ ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నట్లు ఆయన చెప్పారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీ మద్దతుదారులు, అభ్యర్థలకు సపోర్టు ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. తమ నేతలు పర్యటనలు చేపట్టలేకపోతున్నట్లు చెప్పారు. ఎన్నికల వేళ తమ పార్టీ యాడ్స్‌ను ఇవ్వలేకపోతున్నట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి రెండు నెలల ముందే తమ పార్టీని నిర్వీర్యం చేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ, హెూంమంత్రి షా.. క్రిమినల్ చర్యకు పాల్పడినట్లు రాహుల్ ఆరోపించారు. ఎన్నికల ముందు తమను నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతో ఈ ప్లాన్ వేశారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉన్న కొన్ని సంస్థలు ఇప్పుడు ఆ పనిచేయలేకపోతున్నట్లు వెల్లడించారు. ఒక్క కోర్టు కూడా ఎటువంటి విషయాన్ని చెప్పలేకపోతున్నదన్నారు. ఎన్నికల సంఘం మౌనంగా ఉండిపోయిందన్నారు. మరే సంస్థ కూడా నోరు మెదపడం లేదన్నారు. మీడియా కూడా ఏమీ చెప్పడం లేదని రాహుల్ విమర్శించారు. భారత్‌లో ఇప్పుడు ప్రజాస్వామ్యం లేదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రజల నుంచి దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

## కేజ్రీవాల్ నివాసంలో ఈడీ సోదాలు

### రాత్రి పొద్దు పోయిన తరువాత అరెస్ట్



టీ మీడియా, మార్చి 21,ఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి. ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ఇంటికి గురువారం ఈడీ అధికారులు చేరుకున్నారు. దాదాపు 12 మంది అధికారులతో కూడిన ఈడీ బృందం ఆయన ఇంట్లో సోదాలు జరుపుతున్నట్టు సమాచారం.సీఎం నివాసం వద్ద సిబ్బంది ఆరా తీయగా.. సెర్చ్ వారెంట్‌తోనే వచ్చామని చెప్పినట్టు తెలుస్తోంది. మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ఇప్పటికే తొమ్మిది సార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ హాజరయ్యేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. సీఎం ఇంటివద్ద భారీగా పోలీసులు మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గురువారం రాత్రి పొద్దు పోయిన అనంతరం సి ఎం కేజ్రి వాల్ ని అరెస్ట్ చేశారు.మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఈరోజు ఊరట లభించలేదు. ఈ కేసులో ఆయనకు అరెస్టు నుంచి మినహాయింపు కల్పించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుతం ఈ కేసు పురోగతి దృష్ట్యా ఇందులో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పిన గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు ఆయన ఇంటికి చేరుకొని సోదాలు జరుపుతున్నట్టు వస్తోన్న వార్తలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

# మంత్రుల మధ్య నామినేటేడ్ రగడ..?

- తనని సంప్రదించలేదని పొన్నం
- సీనియారిటీ ప్రకారమే వచ్చాయని శ్రీధర్‌బాబు





**టీ మీడియా, మార్చి 21, కరీంనగర్:**
రాష్ట్రంలో కీలక మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు మధ్య నామినేటేట్ చిచ్చు మొదలయ్యింది. ఈ ఇద్దరు నేతలకి ఉమ్మడి జిల్లా పైన మంచి పట్టు ఉంది. గతంలో ఈ ఇద్దరు నేతల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అన్ని సర్దు మణిగాయి. తాజాగా నియామకం అయిన నామినేట్ పోస్టులలో శ్రీధర్‌బాబు ది పై చేయిగా ఉంది. పొన్నం ప్రభాకర్ అనుచరులకి ఒక పోస్ట్ ఇప్పించుకోలేక పోయారు. దీంతో పొన్నం అసహనంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకి చెందిన నేతలకు నామినేటేడ్ పదవులు కట్టబెట్టే విషయంలో తనని సంప్రదించలేదని పొన్నం ప్రభాకర్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి జిల్లాకి చెందిన మరో మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులకే రెండు నామినెటేడ్ పదవులు దక్కాయి. రాష్ట్ర మహిళ కమిషన్ ఛైర్ పర్సన్?గా నేరెళ్ళ శారద, కరీంనగర్ శాతావాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్?గా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నియామకం అయ్యారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం ఇంచార్జీగా పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తున్నారు. అయితే ఈ జిల్లాకి చెందిన ఇద్దరికి నామినేటెడ్ పోస్టుల విషయంలో తనను సంప్రదించలేదని పొన్నం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది.మొదటి నుండి నేరెళ్ళ శారదకి పొన్నం ప్రభాకర్?కి మధ్య విభేదాలున్నాయి. తనతో విభేదాలు ఉన్న వ్యక్తికి నామినేటేడ్ పదవి ఇవ్వడంపై పొన్నం అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి ఇవ్వడం పట్ల కూడా కినుక వహించినట్లు తెలుస్తుంది. ఈ నామినెట్ పోస్ట్?లు పొందిన ఇద్దరూ కూడా శ్రీధర్‌బాబు వర్గీయులే కావడంతో ఇద్దరు మంత్రుల మధ్య మరింత దూరం పెంచింది. ఈ నామినేటెడ్ పోస్టుల వ్యవహారంపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, సియం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి దృష్టికి పొన్నం తీసుకు వెళ్ళినట్లు తెలుస్తుంది. గతంలో కూడా శ్రీధర్ బాబు, పొన్నం మధ్య విభేధాలు ఉండేవి. అయితే సంవత్సరం నుండి విభేధాలు పక్కనబెట్టి పార్టీ బలోపేతం పై దృష్టి పెట్టారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరూ కూడ విజయం సాధించి మంత్రులు అయ్యారు. మంత్రులు అయిన తరువాత సాఫీగా సాగుతున్న ఇద్దరి మధ్య స్నేహం ఇప్పుడు నామినేటేడ్ పోస్టుల భర్తీ విభేదాలకి కారణమ వుతున్నాయి. కనీసం తాను సూచించిన ఒక్కరికూడా నామినేటేడ్ పోస్ట్ ఇవ్వకపోవడంపై పొన్నం అగ్రహాంగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే సీనియారిటీ ప్రకారమే నామినేటేడ్ పోస్ట్?లు వచ్చాయని మంత్రి శ్రీధర్‌బాబు వర్గీయులు చెబుతున్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు ఇద్దరి మంత్రుల విభేదాలు అధిష్టానికి తలనొప్పిగా మారిందని చర్చించుకుంటున్నారు.

## అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

- మంత్రి కొండా సురేఖ



**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్ :**
ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలు స్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించేందుకు ప్రేరణ లభిస్తుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడమే అర్థవంతమైన జీవితమని మంత్రి తెలిపారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. అడవులను సంరక్షించుకునే దిశగా ప్రజలకు అవగాహన కలిగించే నిమిత్తం ప్రతి యేడు మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ సంవత్సరం 'అడవులు, ఆవిష్కరణలు : మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు' థీమ్ తో ప్రపంచవ్యాప్తంగా అటవీ దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో 24.05 శాతం ఉన్న అడవుల విస్తీర్ణాన్ని జాతీయ అటవీ విధానం ప్రకారం 33 శాతానికి పెంచే దిశగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు.

## వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- నల్లమల అడవి ప్రాంతంలోని వన్య ప్రాణులకు పండ్లు, నీటి సౌకర్యం ఏర్పాటు
- మానవత్వం చాటుకున్న విశ్రాంత ఏఎస్ఐ వెంకటేశ్వర్లు



**టీ మీడియా, మార్చి 21, మహానంది:**
నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల అడవిలోని ఘాట్ రోడ్డులో సంచరించే మూగజీవులైన కోతులు ఉడతలు ఇతర జీవుల ఆకలి దప్పులకు చలించిన నంద్యాల చెందిన విశ్రాంత ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తన మిత్రులతో కలిసి రోడ్డు వెంట ఉన్న తొట్లల్లో నీరు పోసి దప్పిక తీర్చారు. అలాగే అరటి తో పాటు ఇతర పండ్లను వాటికి అందించి ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ వేసవికాలంలో ప్రతి ఒక్కరూ మూగజీవుల పట్ల మానవత్వంతో స్పందించి, ఆకలి దప్పులను తీర్చాలని, వాటికి ఎలాంటి ప్రాణహాని కలుగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లె గ్రామస్తులు జిల్లా శ్రీనివాసులు, చిన్నారులు జ్యోతి స్వరూప్, దేవేంద్ర, పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన రామగుండం పోలీస్ కమీషనర్



**టీ మీడియా, మార్చి 21, రామగుండం:**
పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్(ఐజి) పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరిఖని లోని ప్రభుత్వ బాలికల పాఠశాల, సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ లోని పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ పర్యవేక్షంచారు. పదవతరగతి పరీక్షలను పురస్కరించుకొని పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దృష్టి పెట్టాలని,పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది గుమిగూడవద్దని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.అధికారులు ఎవరైనా సరే పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రం లోపలికి అనుమతించాలని అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి సూచించారు.పదవతరగతి పరీక్షలు కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్ష సమయం కన్నా గంట ముందు పరీక్ష కేంద్రాల చుట్టూ పోలీస్ వారు తనిఖీ చేయడం జరుగుతుంది అన్నారు.ప్రశ్నపత్రాలు తీసుకు వెళ్ళడం ఎగ్జామ్ పూర్తయిన తర్వాత మరియు జవాబు పత్రాలను తిరిగి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చే వరకు పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద కూడా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఎవరు కూడా పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు ఎవరు మాల్ ప్రాక్టీస్ కు పాల్ప డకుండా సహజంగా పరీక్షలకు హాజరై రాయా లన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి సెల్ ఫోన్ ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్ ,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రాసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే ను విజయవంతం చేద్దాం

- వనపర్తి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు (టీయుడబ్ల్యూజే)
- జి.మధుగౌడు డి.మాధవరావు

**టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :**
జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తూ, మీడియా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, షహీద్ భగత్ సింగ్ వర్ధంతి రోజైన ఈ నెల 23న దేశ వ్యాప్తంగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) ఇచ్చిన జర్నలిస్ట్ డిమాండ్స్ డే పిలుపును రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లా కేంద్రాల్లో విజయవంతంగా నిర్వహించాలని, టీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ తెలిపారు. 23 శనివారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా లో ఉదయం 9.30 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుంది. కావున జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులతో పాటు అన్ని మండలాల్లోని జర్నలిస్టులు అందరూ సకాలంలో జిల్లా కేంద్రానికి రాగలరని విజ్ఞప్తి, అనంతరం జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల బాధ్యులకు, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు వినతిపత్రాలను అందించాలి. సకాలంలో హాజరు కావాలని కొరడమైనది.



## పీపుల్స్ క్వశ్చన్ అవర్ ఏర్పాటు

- ఎమ్మెల్యే వినూత్న కార్యక్రమం..



**టీ మీడియా, మార్చి 21, నకిరేకల్:**
క్వశ్చన్ అవర్ అనే పదం సాధారణంగా చట్టసభల్లో వినిపిస్తుంటుంది. క్వశ్చన్ అవర్?లో ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నిస్తుంటారు. కానీ ఓ ఎమ్మెల్యే మాత్రం తన వందరోజుల ప్రజాపాలనపై ప్రజల నుంచి పీపుల్స్ క్వశ్చన్ అవర్ ను నిర్వహించారు. పీపుల్స్ క్వశ్చన్ అవర్ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన ఆ ఎమ్మెల్యే ఎవరో తెలుసుకోవాలంటే ....నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం ఎన్నికయ్యారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఉంటారు. తెలంగాణ ఏర్పడి తొలి ఎన్నికల్లో వేముల వీరేశం బీఆర్ఎస్ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన వేముల వీరేశం ప్రజా సమస్యలపై మరింత దృష్టి సారించారు. కాంగ్రెస్ ప్రజాపాలనకు వంద రోజులు- ప్రజా నాయకుడికి 100 ప్రశ్నలు' పీపుల్స్ క్వశ్చన్ అవర్ పేరుతో వినూత్నకార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఎమ్మెల్యే వేముల వీరేశం సమాధానం చెప్పారు. ప్రధానంగా నియోజక వర్గానికి సాగునీటి కల్పన, రహదారుల విషయంలో ప్రజలు పలు ప్రశ్నలను ఎమ్మెల్యే వీరేశం దృష్టికి తీసుకువచ్చారు.వంద రోజుల కాంగ్రెస్ ప్రజా పాలనలో 65 కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గానికి ప్రాణాధారమైన బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోతల పథకాన్ని జూన్ నాటికి పూర్తిచేసి సాగునీటిని అందిస్తానని వీరేశం చెప్పారు. విజన్ నకిరేకల్ పేరుతో 200 మందితో అఖిలపక్ష కమిటీని వేసి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని ఆయన అన్నారు. గంజాయి రహిత నకిరేకల్‌గా చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేగా తన పని తీరుపై స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశ్నించే గొంతుకగా ప్రజల నుంచి స్పందన తెలుసుకోవడానికి పీపుల్స్ క్వశ్చన్ అవర్ ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గ అభివృద్ధిపై పీపుల్స్ క్వశ్చన్ అవర్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంబయ్య, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్, ఎంపీపీలు బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్, జెల్ల ముత్తిలింగయ్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, సుంకరబోయిన నర్సింహ, లింగాల వెంకన్న పాల్గొన్నారు.




## క్యాంపుకు బయలుదేరిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

**టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :**
మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యములో స్థానిక సంస్థల ఎం.ఎల్.సి అభ్యర్థి నవీన్ రెడ్డికి మద్దతుగా క్యాంపుకు నియోజకవర్గ జడ్పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్లు బయలుదేరి వెళ్ళినారు.వీరిలో అనారోగ్యము చేత చిట్యాల, ఏదుల,పాతపల్లీ ఎంపిటిసి లు హాజరు కాలేదు. రంగాపూర్, ఘనపూర్, బుద్దారం ఎంపిటిసి లు కౌన్సిలర్స్ మంజుల, పాకనాటి.కృష్ణ వ్యక్తిగత పనుల వల్ల రెండు రోజులలో క్యాంపుకు హాజరవుతున్నారు. బీచుపల్లి ఆంజనేయ స్వామినీ దర్శించుకున్న నిరంజన్ రెడ్డి క్యాంపుకు బయలుదేరిన ప్రజాప్రతినిధులతో కలసి నిరంజన్ రెడ్డి బీచుపల్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నిరంజన్ రెడ్డి నాయత్వములో నవీన్ రెడ్డిని గెలిపిస్తామని అన్నారు.

## మతమా! మానవత్వమా! లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం

**టీ మీడియా, మార్చి 21, గోదావరిఖని :**
సాయి తేజ క్రియేషన్స్ పతాకంపై సీనియర్ దర్శకులు దామెర శంకర్ స్వీయ రచన, దర్శకత్వంలో నిర్మిస్తున్న 'మతమా! మానవత్వమా!' సందేశాత్మక లఘుచిత్రం షఉటింగ్ ను గురువారం గోదావరిఖనిలో ప్రారంభించారు. మాజీ వైస్ చైర్మన్ తానిపర్తి గోపాల్ రావు క్లాప్ కొట్టి షఉటింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మతం కన్న మానవత్వం మిన్న అనే కథాంశంతో లఘు చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. దామెర శంకర్ గతంలోనూ ఎన్నో సందేశాత్మక లఘు చిత్రాలను నిర్మించారని,ఈ చిత్రం కూడా ప్రశంసలందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దయానంద్ గాంధీ, కో-ఆప్షన్ సభ్యులు వంగ శ్రీనివాస్ గౌడ్,మూల శంకర్,డాక్టర్ శంకర్ లింగం, డాక్టర్ ఆర్ఎస్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ లఘు చిత్రానికి కెమెరామెన్ గా మహబూబ్, అసిస్టెంట్ కెమెరామెన్ గా శంకర్,మేకప్ మెన్ గా అంజి బాబు వ్యవహరిస్తుండగా, మేజిక్ రాజా,కుమార్ పటేల్, అందె సదానందం,గజెల్లి రాజలింగు,దామెర రాజేష్ నటిస్తున్నారు.ఎడిటింగ్,రీ రికార్డింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని త్వరలోనే యూ ట్యూబ్ లో విడుదల చేస్తామని దర్శకులు దామెర శంకర్ తెలిపారు.

## చలివేంద్రంలో అంబలి వితరణ



**టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లెల మాధవరెడ్డి చలివేంద్రంలో మంచినీటితో పాటు గురువారం నుండి అంబలి వితరణ చేయడం జరిగింది. వనపర్తి జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ మహిళకు అంబలి అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందిమల్ల యాదయ్య, దేవన్న యాదవ్, అసిఫ్, వీణాచారీ,గడ్డం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లలోకి చొరబడిన పాము



**టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట మీద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి చొరబడిన పాము ఇది గమనించిన వెంటనే బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు వజ్రాల రమేష్ స్నేక్ సొసైటీ కృష్ణ సాగర్ కు ఫోన్ చేయడంతో వారు వెంటనే వచ్చి పాములు పట్టుకు వెళ్ళడం జరిగింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలి

- విద్యాధికారుల నిర్లక్ష్యమే.. ఇలాంటి ఘటనలకు నిదర్శనం



**టీ మీడియా, మార్చి 21, గోదావరిఖని :**
పారిశ్రామిక ప్రాంతంలోని ఇండో అమెరికన్ స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని ఇండో అమెరికన్ హై స్కూల్లో మూడో తరగతి చదువుతున్న పునీత్ అనే విద్యార్థినిని ఆ కారణంగా చితకబాదిన ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని,ఇండో అమెరికన్ స్కూల్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఆయన అన్నారు.మూడు నెలల క్రితం ఆర్.ఎఫ్.సిఎల్ లోని శ్రీ చైతన్య స్కూల్లోని విద్యార్థిని చితకబాదిన ఘటనలు మరిచిపోక ముందే ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నరని,ఇలాంటి పాఠశాలలపై విద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృత్తం అవుతున్నాయని ఆయన అన్నారు.ఇప్పటికైనా విద్యాధికారులు స్పందించి స్కూల్ గుర్తింపు రద్దు చేసి, ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇనిగాల ప్రశాంత్,పసుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమానికి విరాళం

- అందించిన విప్ లక్ష్మణ్ కుమార్



**టీ మీడియా, మార్చి 21, ధర్మపురి :**
ధర్మపురి లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం ఉచిత అన్నదానం కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ కమిటి సభ్యలకు 10 వేల రూపాయలు అందజేశారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యంగా ఉండకుండా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామనిఅన్నారు.తధానంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించి భక్తులతో కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగన బట్ల దినేష్,నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్,మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్,జక్కు రవి,రాజేష్, అప్పం తిరుపతి, శ్రావణ్, అలిశెట్టి శ్రీను,సుముక్ మండల నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి



**టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :**
వచ్చే హరిత హారానికి మొక్కలు వనపర్తి జిల్లా నుండే వాడుకునె విధంగా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఉదయం పెద్దమందడి మండలం జంగమయాపల్లి గ్రామ పరిధిలోని అటవీ శాఖ నర్సరీని సందర్శించి పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా సరైన విధంగా నీరు పోసి ఎప్పటికప్పుడు బ్యాగులు మారుస్తూ మొక్కలను సమీక్షించాలని సూచించారు. వచ్చే హరిత హారం కార్యక్రమానికి జిల్లాకు అవసరమైన మొక్కలు జిల్లాలోని నర్సరీల నుండే వాడుకునే విధంగా చూడాలని సూచించారు. మొక్కల పెంపకం గురించి ఆరా తీశారు. చనిపోయిన వారి స్థానంలో మరోమారు విత్తనాలు వేసి మొక్కలు వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు.

## స్టే విధించేందుకు సుప్రీం నిరాకరణ



**టీ మీడియా, మార్చి 21,న్యూఢిల్లీ :**
ఎన్నికల కమిషనర్‌లను నియమించే చట్టంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. ఈ దశలో స్టే విధిస్తే గందరగోళానికి దారితీస్తుందని పేర్కొంది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టం ప్రకారం.. నియమితులైన ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులపై ఎటువంటి ఆరోపణలు లేవని కోర్టు పేర్కొంది.ఎన్నికల సంఘం కార్యనిర్వాహక అధికారి కింద ఉందని చెప్పలేమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రం రూపొందించిన చట్టం తప్పు అని భావించలేమని, నియమితులైన వ్యక్తులపై కూడా ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్నికలు సమీపిస్తున్నందున ఈ సమయంలో సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని పేర్కొంది.ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) బిల్లు 2023ని గతేడాది పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్రపతి ఆమోదం పొందింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రితో ఎన్నికల కమిషనర్‌లను ఎన్నుకునేందుకు కమిటీని నియమించాలని నూతన చట్టం సూచించింది.దీంతో ఈ కమిటీ నిష్పాక్షితపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కమిటీ ఎంపిక అనంతరం లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిటీ ఎంపిక ముందు రోజు తనకు పరిశీలన కోసం 212 పేర్లను ఇచ్చారని, సమావేశానికి ముందు ఆరు పేర్లతో షార్ట్‌లిస్ట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కొత్త చట్టంతో కమిటీ ఎంపికను 'లాంఛనప్రాయం' చేసిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# దేవాలయం నిర్మాణ పనులు పరిశీలించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, మార్చి 21, వనపర్తి బ్యూరో :**



పాతబజార్ నందు రోడ్డు విస్తరణలో బాగంగా ఆధునీకరిస్తున్న దేవాలయం పనులను బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం పరిశీలించారు. గతములో ఈ గుడి నిర్మాణం కోసం తన సొంత డబ్బులు 5 లక్షలు ఇవ్వడం జరిగింది. అదే విధంగా కాళికామాత దేవి దర్శనం చేసుకుని ఈరెండు దేవాలయాల నిర్మాణం కోసం సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నిరంజన్ రెడ్డి గారి వెంట నీలస్వామీ, ఎర్ర.శ్రీను, బాలస్వామి,రామస్వామి,రవి తదితరులు ఉన్నారు.

# పారిశుధ్య పనులను పటిష్టంగా చేపట్టాలి

- **రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్**

**టీ మీడియా, మార్చి 21, గోదావరిఖని:**



పారిశుద్ధ పనులను పటిష్టంగా చేపట్టాలని గురువారం రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ పారిశుద్ధ విభాగం అధికారులను సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ తనిఖీ అధికారులు, పారిశుద్ధ వాహనాలచోదకులతో వేరువేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ నిర్వహణ తీరుపై నగర ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉన్నందున పారిశుద్ధ విభాగం సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని కోరారు. అకారణంగా ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజన్ కారాదని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించాలని, సూచించారు. ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా గృహస్తులకు అవగాహన కల్పించాలని  తెలిపారు. వాహనాల ఇంధనం ఆదా చేయాలని చోదకులను ఆదేశించారు. అనంతరం నగరంలో వివిధ చోట్ల జరుగుతున్న పారిశుద్ధ పనులను పర్యవేక్షించారు. ఆయనతోపాటు డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, సునీల్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనంగా 26,000 చెల్లించాలి

- **క్యాతనపల్లి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక**

**టీ మీడియా, మార్చి 21, రామకృష్ణాపూర్ :**



క్యాతనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల శ్రమను పాలకులు గుర్తించి  కనీస వేతనంగా 26,000 రూపాయలు చెల్లించాలని దూలం శ్రీనివాస్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల సమావేశం గురువారం మహేందర్ అధ్యక్షతన నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కోవిడ్ సమయంలో కూడా కార్మికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేసి ప్రభుత్వం, ప్రజల మన్ననలు పొందారు. కానీ కార్మికుల పొట్టలు నింపే ప్రయత్నం ప్రభుత్వం మాత్రం చేయ్యలేదు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన మున్సిపల్ కార్మికుల శ్రమను గుర్తించి 26,000 రూపాయలు కనీస వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడు ఎం.మహేందర్ కార్యదర్శి వెమూర్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు జి.రాజశేఖర్, సహాయ కార్యదర్శి ఎం.నారాయణ,కోశాధికారి జె.దేవావరం,ప్రచార కార్యదర్శి కాసర్ల తిరుపతి,కమిటీ సభ్యులుగా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# అయోధ్య బాలరామయ్యను దర్శించుకున్న దక్షిణాఫ్రికా క్రికెటర్

**టీ మీడియా, మార్చి 21, అయోధ్య:**



దక్షిణాఫ్రికాకు చెందిన వెటరన్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ ఐపీఎల్ ప్రారంభానికి ముందు లక్నో సూపర్‌జెయింట్స్ క్యాంప్‌లో కనిపించాడు. అదే సమయంలో, అతను అయోధ్యలోని రామమందిరాన్ని కూడా సందర్శించి, మహారాజ్ శ్రీరాముని దర్శనం పొందాడు. అనంతరం ఆనందాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడీ స్టార్ స్పిన్నర్. అంతకుముందు అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం రోజున సామాజిక మాధ్యమాల ద్వారా భారతీయులందరికి శుభాకాంక్షలు తెలిపాడీ దక్షిణాఫ్రికా క్రికెటర్. తాను తదుపరిసారి భారతదేశాన్ని సందర్శించినప్పుడు కచ్చితంగా శ్రీరాముని దర్శనం చేసుకుంటానని చెప్పాడు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు అయోధ్యను సందర్శించాడు కేశవ్ మహారాజ్. బలరామునికి ప్రత్యేక పూజలు చేశాడు. కాగా భారత సంతతికి చెందిన కేశవ్ మహారాజ్ కు హిందూ సంప్రదాయాలు, ఆచారాలన్నా బాగా ఆసక్తి చూపిస్తాడు. గతేడాది దక్షిణాఫ్రికా జట్టు సిరీస్ ఆడేందుకు భారత్ వచ్చినప్పుడు కేశవ్ మహారాజ్ తిరువనంతపురంలోని ప్రముఖ దేవాలయం పద్మనాభస్వామి మందిరాన్ని సందర్శించాడు. అక్కడి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పుడు అయోధ్యను సందర్శించి శ్రీరాముని దర్శనం పొందాడు. ప్రస్తుతం బలరాముని దర్శించుకుంటున్న కేశవ్ మహారాజ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతున్నాయి.ఇక కేశవ్ మహారాజ్ విషయానికి వస్తే.. దక్షిణాఫ్రికా తరపున 127 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మొత్తం 237 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో దర్బన్ సూపర్ జెయింట్స్ జట్టుకు నాయకత్వం వహించిన మహారాజ్ ఈ ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోలేదు. అయితే ఇప్పుడు ఐపీఎల్ ప్రారంభానికి ముందు లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ క్యాంపులో కనిపించడం విశేషం

# వివాహ మహోత్సవం సందర్భంగా..

- **మిత్ర బృందంతో స్వచ్ఛంద రక్తదానం**

**టీ మీడియా, మార్చి 21, రామకృష్ణాపూర్ :**




క్యాతనపల్లి మున్సిపాలిటీ గద్దె రాగడి ప్రాంతానికి చెందిన ఆకనపల్లి సురేష్ స్వామి తన వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని తన పదిమంది మిత్ర బృందంతో కలిసి గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త నిధి కేంద్రంలో స్వచ్ఛంద రక్తదానాన్ని చేసినారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి. మధుసూదన్ రెడ్డి, కే.సత్యాపాల్ రెడ్డిలు పాల్గొని, రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ జన్మదిన, వివాహ మహోత్సవాల  సందర్భంగా స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావలసిందిగా కోరుకున్నారు.ఈ శిబిరంలో ఏ. సురేష్,వేణుగోపాల్, శ్రీధర్,శరత్,రమేష్, రక్త నిధి సిబ్బంది కే. మాధవి, సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల తవ్వాకాలల్లో బయట పడ్డ విగ్రహాలు

**టీ మీడియా, మార్చి 21, ఎండపల్లి :**



ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామ శివారులోని ఎక్కల్ దేవి గుట్టకు జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీలు కందకాలు తవ్వుతుండగా దేవుళ్ళ విగ్రహాలు సుమారు15వరకు బయటపడ్డాయి ఆ విగ్రహాలను చుసిన ఉపాధి హామీ కూలికి పూనకం వచ్చి పూజలు చేయాలనీ గుడి కట్టించాలని పలుకగా, అక్కడే వున్నా ఫీల్డ్ అసిస్టెంట్ జుంజిపెల్లి సురేష్ గ్రామస్థులకు విషయం తెలియ జేయగా గ్రామస్తులు ఆ విగ్రహాలకు పసుపు కుంకుమ, కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.ఆ విగ్రహాలల్లో హనుమంతుడు, రాజ రాజేశ్వర స్వామీ, పోచమ్మ శివలింగాలు, దేవత విగ్రహాలకు సంబంధించిన వస్తువులతొ పాటు మరో భారీ విగ్రహం ఉన్నట్లు, పురాతన వస్తూ శాఖకు సంబంధించిన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే మరికొన్ని దేవత మూర్తుల విగ్రహాలు బయటపడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు అనుమానం వ్యక్త పరుస్తున్నారు.

# మహానంది క్షేత్రంలో వైభవంగా పదహారు రోజుల పండుగ

**టీ మీడియా, మార్చి 21, మహానంది:**



ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో  ఈనెల 23వ తేదీన 16 రోజుల పండుగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వేద పండితులు రవిశంకర అవధాని గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి  సందర్భంగా జరిగిన కళ్యాణోత్సవ దీక్షా, విసర్జన,అంకుర విసర్జన, రథాంగ దేవతల ఉద్వాసన కార్యక్రమాలు శనివారం పగలు 12.00 గంటలకు వైభవంగా నిర్వహిస్తున్నారని,భక్తులు విరివిగా పాల్గొని శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వరుల అనుగ్రహం పొందగలరని వారు కోరారు.

# గీత దాటితే వేటే

- **పోలీసుల స్పెషల్ ఫోకస్..**

**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్:**







లోక్‌సభ ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముందస్తుగా రౌడీ షీటర్లు, పాత నేరస్థులు, కమ్యూనల్ అఫెండర్స్‌పై నిఘా పెట్టారు తెలంగాణ పోలీసులు. నేరాలకు పాల్పడకుండా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్లకు పిలిపించి వాళ్ల కదలికలపై ఆరా తీస్తున్నారు.ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలు చేయకుండా వారికి గట్టి వార్నింగ్ ఇస్తున్నారు. కొన్ని కేసుల్లో కనిపించకుండా పోయిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. మరికొంతమంది ఇంటికి నేరుగా వెళ్లి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. రీసెంట్‌గా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొంతమంది పాత నేరస్థులు పోలీసుల హెచ్చరికలను సైతం పట్టించుకోకుండా పలువురిని బెదిరించినట్లు గుర్తించిన పోలీసులు వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ క్రియేట్ చేస్తారనే అనుమానం ఉన్న వాళ్లను బైండోవర్ చేస్తున్నారు పోలీసులు. మూడు పోలీసు కమిషనరేట్ పరిధిలో దాదాపు 3వేల 5వందల మంది రౌడీషీటర్లు రికార్డుల్లో నమోదయ్యారు. వీరితో పాటు వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వాళ్లపైనా పోలీసులు నిఘా పెట్టారు. హైదరాబాద్ మహానగరంతోపాటు సిటీ శివారు ప్రాంతాల్లో ప్రైవేటు దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, హొటళ్లు ,, హవాలా, హత్యలు, బెదిరింపులకు పాల్పడుతున్న ఏ వన్ రౌడీ షీటర్లు వెయ్యి మంది వరకు ఉన్నట్టు పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అయా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను ఉన్నతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. రౌడీ షీటర్ల బైండోవర్ వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా సౌత్ జోన్, సౌత్ ఈస్ట్, వెస్ట్ జోన్ పరిధిలో ఎక్కువ మంది రౌడీషీటర్లు ఉన్నట్లు రికార్డు చెబుతున్నాయి. పోలీస్ స్టేషన్ల వారీగా వాళ్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లకు సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలిచ్చారు. కొంతమందిని రౌడీషీటర్లను తహసీల్దార్, ఆర్డీవోల వద్ద బైండోవర్ చేయాలని సూచించారు.రౌడీషీట్ ఉన్నవాళ్లు ఏం పని చేస్తున్నారు. ఎవరి దగ్గర చేస్తున్నారు. రోజువారి కదలికలపై నిత్యం మానటరింగ్ చేయాలని పోలీస్ కమిషనర్లు కింది స్థాయి అధికారులకు సూచించారు. ఇంకా కొందరు రౌడీ షీటర్లు ఇళ్లులు మార్చడంతో ప్రస్తుతం వాళ్లు ఎక్కడ ఉంటున్నారనే ఆరా తీయాలని ఆదేశించారు. మరోవైపు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న రౌడీషీటర్లపై పోలీసులు ఫోకస్ చేస్తున్నారు. కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఐదుగురు, సూరారంలో నలుగురు, ఎస్సార్ నగర్ లో నలుగురు, తుకారంగేట్‌లో నలుగురు, సైదాబాద్ లో ఇద్దరు, పేట్ బషీరాబాద్ లో ఇద్దరు, కంచన్ బాగ్ లో ఇద్దరు చొప్పున రౌడీషీటర్లు అజ్ఞాతంలో వెళ్ళినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ప్రస్తుతం వారంతా ఎక్కడున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. పోలీస్ రికార్డులను బట్టి.. రౌడీ షీటర్లపై ప్రతీ జోన్ లో డీసీపీ మానిటరింగ్ చేయనున్నారు.

# విద్యార్థులు సామాజిక సేవలలో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని, సేవా గుణాన్ని అలవర్చుకుంటారు

- **డా.రామకృష్ణారెడ్డి**

**టీ మీడియా, మార్చి 21, మహానంది:**







విద్యార్థినిలు శ్రమదానం చేయడం ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకొని సేవా గుణాన్ని అలవర్చుకుంటారని రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలంలోని తిమ్మాపురం మహానంది గ్రామాల్లో శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్. విభాగం వారు క్లీన్ అండ్ గ్రీన్ స్వచ్ఛభారత్ డోర్ టు డోర్ శ్రమదానం కార్యక్రమం ఏడు రోజులపాటు నిర్వహించారు. మహానంది దేవస్థానంలోని పోచ బ్రహ్మానందరెడ్డి భవనంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినిలు శ్రమదానం చేశారు.అనంతరం  కల్చర్ యాక్టివిటీస్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు, ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి ల చేతుల మీదుగా, ఎన్. ఎస్. ఎస్. కు చెందిన 55 మంది విద్యార్థినిలకు ప్రశంస పత్రాలు, అవార్డులను అందజేశారు. అనంతరం మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ని రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించి సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్యాంపులలో విద్యార్థినిలు పాల్గొనడం వల్ల సామాజిక విషయాలు తెలుస్తాయని, సామాజిక సేవలతో వ్యక్తిత్వ వికాసం చెందుతుని, తద్వారా సేవా గుణాన్ని అలవర్చుకుంటారన్నారు. అనేక జీవిత  విషయాలలో అవగాహన కలుగుతుందని, సమస్యలను పరిష్కరించుకోవడంలో ధైర్యంగా వ్యవహరిస్తారని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినిలు మహానంది పోచ బ్రహ్మానంద రెడ్డి భవనంలో శ్రమదానం కార్యక్రమం విజయవంతమైందని, విద్యార్థినిలు కలిసికట్టుగా స్వచ్ఛందంగా పనిచేయడం అభినందనీయ మన్నారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య,పిఓ రమణమ్మ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం బిఆర్ఎస్ ముందస్తు కార్యచరణ

- **పార్లమెంటరీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ను భారీ మెజార్టీ తో గెలిపించుకుందాం**
- **మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

**టీ మీడియా, మార్చి 21, రామకృష్ణాపూర్ :**



లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ సూపర్ బజార్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం పట్టణ అధ్యక్షులు ఇంచార్జ్ ల ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంటరీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చెన్నూరు మాజీ శాసన సభ్యులు బాల్క సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహ, ప్రతివ్యూహాలపై, ప్రచారంలో అనుసరించాల్సిన విధివిధానాలపై కార్యకర్తలకు నాయకులు దిశా నిర్దేశం చేశారు.రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాలలో వ్యక్తుల ద్వారా ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకులను అభ్యర్థి ఈశ్వర్ పరిచయం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది మరొకటి. మోసపూరిత పథకాలు అమలు చేయలేక కాలయాపనతో ఎన్నికల్లో పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నది అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సమస్యలను పక్కకు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి డబ్బు సంచులు మోసే పనిలో ఉన్నారు.రేవంత్ ఒడ్డి భాష, మాటతీరు రెండు మార్చుకోవాలని హితవు పలికారు. చెన్నూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థిగా వివేక్ ప్రకటించిన మేనిఫెస్టోని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి కొప్పుల ఈశ్వర్ ని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు,ఇంచార్జ్ సుదర్శన్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, డాక్టర్ రాజా రమేష్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి

## తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులే : నారా లోకేష్



**టీ మీడియా, మార్చి 21, తిరుపతి బ్యూరో** :తిరుపతి రాజకీయ పరిణామాలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, రెండ్రోజుల్లో అన్ని సర్దుకుంటాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా గురువారం తిరుమల శ్రీవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన నారా లోకేష్‌ను తిరుపతి టిడిపి నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్ కలిశారు. అనంతరం టిడిపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తిరుపతి రాజకీయ పరిణామాలపై నాకు పూర్తి సమాచారం ఉందని, రెండు రోజుల్లో అన్ని సర్దుకుంటాయన్నారు. తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులేనని స్పష్టం చేశారు. తిరుపతి నియోజకవర్గం ప్రజలతో మమేకమై ప్రచారాన్ని ఉధృతం చేయాలని శ్రీనివాసులుకు లోకేష్ దిశా నిర్దేశం చేశారు.సుగుణమ్మకు లోకేష్ క్లాస్‌తిరుపతి జనసేన అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరిన సుగుణమ్మకు నారా లోకేష్ క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. రాజకీయాలలో ఇలాంటివి సహజమేనని, పార్టీ అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు ఇస్తామని, పొత్తు ధర్మంగా జనసేన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది.నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానంలోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి సేవలో కుటుంబ సభ్యులు పాల్గన్నారు. ఈ సందర్భంగా తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో రూ. 38 లక్షల విరాళాన్ని ఇచ్చారు. అన్నదాన సత్రంలో సందర్శకులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు.

# అరుణాచల్ ప్రదేశ్ భారత్‌దే..

## చైనాకు అమెరికా కౌంటర్..

**టీ మీడియా, మార్చి 21, న్యూఢిల్లీ :**



అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ పట్టుబడుతున్న డ్రాగన్ కంట్రీ చైనాకు అమెరికా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఆ ప్రాంతాన్ని భారత్ భూ భాగంగా త ా వ ం ం గుర్తించామని..వాస్తవాధీన రేఖను మార్చే ఎటువంటి ప్ర య ం త్నా ల న ం సహించబోమని స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ మాదేనంటూ చైనా ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అమెరికా స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది.. బుధవారం జరిగిన పత్రికా సమావేశంలో అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ.. చైనా వ్యాఖ్యలు అర్ధరహితమని ఆగ్రహం వ్యక్తంచేశారు. %ఖూ% స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ డిప్యూటీ స్పోక్స్‌పర్సన్ వేదాంత్ పటేల్ మాట్లాడుతూ.. "అరుణాచల్ ప్రదేశ్‌ను యునైటెడ్ స్టేట్స్ భారత భూభాగంగా గుర్తిస్తుంది.. వాస్తవ నియంత్రణ రేఖ అంతటా చొరబాట్లు లేదా ఆక్రమణలు, సైన్యం ద్వారా ఉద్రిక్త పరిస్థితులను ఏర్పరిచే ఏ ఏకపక్ష ప్రయత్నాలనైనా మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము.." అంటూ పేర్కొన్నారు.అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ మొండిగా వ్యవహరిస్తూ వస్తున్న చైనా.. తన వక్రబుద్ధిని బయటపెట్టింది.. ఈ నెల9న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించి సేలా సొరంగ మార్గాన్ని ప్రారంభించారు. సొరంగ మార్గం ప్రారంభం తర్వాత చైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. జాంగ్నాన్ తమదేనని, సేలా సొరంగాన్ని భారత్ చట్టవిరుద్ధంగా స్థాపించిందంటూ చైనా ఆరోపించింది.. అయితే దీనిపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఉత్తుత్తి పేర్లతో క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను మార్చలేరని.. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని తేల్చిచెప్పింది.

కాగా..అరుణాచల్ ప్రదేశ్‌లో భారత నేతల పర్యటనలపై చైనా నిరంతరం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అంతేగాక చైనా.. గతేడాది అరుణాచల్ ప్రదేశ్‌లోని 11 ప్రాంతాల పేర్లను మార్చింది. గత ఐదేళ్లలో చైనా ఈ చర్యలకు పాల్పడటం ఇది మూడోసారి.. దీనిని ఎప్పటికప్పుడు భారత్ ఖండిస్తూనే ఉంది.. అటు అమెరికా కూడా అరుణాచల్ ప్రదేశ్ భారత భూభాగమేనని పలుమార్లు నొక్కి చెప్పినా చైనా మొండి వైఖరి మాత్రం మారలేదు. ఈ క్రమంలోనే చైనా వ్యాఖ్యలపై.. భారత్ తోపాటు.. అమెరికా కూడా స్పందించి డ్రాగన్ కంట్రీకి కౌంటర్ ఇచ్చాయి.అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా సైన్యం "చైనా భూభాగంలో అంతర్లీన భాగం" అని పేర్కొన్న తర్వాత వాషింగ్టన్ దానిని భారత భూభాగంగా గుర్తిస్తోందని యుఎస్ అధికారి ఒకరు తెలిపారు. వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసి) అంతటా ప్రాదేశిక క్లెయిమ్‌లను ముందుకు తీసుకెళ్లడానికి చేసే ఏవైనా ప్రయత్నాలను యుఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అధికారి తెలిపారుభారతదేశం అక్రమంగా స్థాపించిన అరుణాచల్ ప్రదేశ్‌ను బీజింగ్ ఎప్పుడూ గుర్తించదు, గట్టిగా వ్యతిరేకించదు" అని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి సీనియర్ కల్నల్ జాంగ్ జియోగాంగ్ చెప్పిన మూడు రోజుల తర్వాత %ఖూ% అధికారి ఈ ప్రకటన చేశారు.

# వర్క్ ఫ్రమ్ హెూమ్ లో సీఎం రేవంత్ రెడ్డి అదే దారిలో రాష్ట్ర మంత్రులు!

**టీ మీడియా, మార్చి 21, హైదరాబాద్:**



నిత్యం సందర్శకులతో కలకలలాడే సచివాయలం ఒక్కసారిగా బోసిపోయింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సాధారణ ప్రజలను కూడా నిర్ణీత వేళల్లో సచివాలయం లోనికి  అనుమతిస్తున్న విషయం విధితమే. కానీ లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి షెడ్యూల్ వెలువరించడంతో ముఖ్యమంత్రితో సహా మంత్రులు ఎవ్వరూ సచివాలయానికి రావడం లేదు. దాంతో సందర్శకుల సంఖ్య గణనీయవంగా తగ్గిపోయింది.పీసీసీ అధ్యక్షుడు కూడా అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సచివాలయానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు సచివాలయానికి రావద్దని ఆయన నిర్ణయించుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అలాగే, మంత్రులు కూడా సచివాలయానికి రావడం లేదు. మంత్రులు తమ తమ జిల్లాల్లో ఎన్నికల ప్రచారంలో బిజీ అయ్యారు. ప్రభుత్వానికి సంబంధించిన రోజూ వారీ వ్యవహారాలను తమ ఇళ్ల నుంచే పర్యవేక్షిస్తున్నారు.ముఖ్యమంత్రి, మంత్రులు అందుబాటులో లేకపోవడంతో సాధారణ ప్రజలు, సందర్శకులు సచివాయలంలో కనిపించడం లేదు. సాధారణంగా సందర్శకులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలోనికి అనుమతి ఉంటుంది. అయితే, మంత్రులను కలుసుకోడానికి వచ్చే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులకు ఆ నిబంధన వర్తించబోదు. కానీ ఎవరైనా మంత్రులను కలుసుకోడానికి ప్రత్యేక అనుమతి తీసుకుంటే సాధారణ వేళల్లోనూ మంత్రుల పేషీ నుంచి భద్రతా సిబ్బందికి సమాచారం వస్తుంది. అప్పుడే వారిని లోనికి అనుమతిస్తారు.మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులను కలుసుకోడానికి యధావిధిగా అనుమతి ఉంది. అయినప్పటికీ ఎన్నికల కోడ్ పరిమితుల దృష్ట్యా అన్ని పనులు అవ్వడం లేదని భావించి ఎక్కువ మంది సందర్శకులు సచివాలయానికి రావడం మానేశారు. దీంతో సచివాలయానికి భారీగా రద్దీ తగ్గింది.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఆయా సమస్యలు, జరుగుతున్న పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఎప్పటికప్పుడు సచివాలయం కేంద్రంగా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే పగడ్బందిగా ఎన్నికల నిర్వహణకు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.